A

**అడల్ట్స్ ఓన్లీ కథ!**

# గెలుపు

## సి.ఎన్.చంద్రశేఖర్


''హోయ్ రమ్యా యిక్కడ''

ట్రైను దిగి స్నేహితురాలి కోసం ఎదురుచూస్తున్న రమ్య, సింధు గొంతు విని తలతిప్పి చూసింది. ఆమెని రిసీవ్ చేసుకోవడానికి సింధు తన భర్తతో వస్తూ కనిపించింది.

''అబ్బ.ఎన్నాళ్ళయిందే నిన్ను చూసి'' సింధు చేతులు పట్టుకుంటూ ఆప్యాయంగా అంది రమ్య.

''అవును. రెండేళ్ళు అయింది. రమ్యా ఈయన మా శ్రీవారు రోహిత్'' అంటూ భర్తను పరిచయం చేసింది. 'చాలా అందంగా ఉన్నాడు రోహిత్. సింధు అదృష్టవంతురాలు' మనసులోనే అనుకొంది రమ్య.

''రండి. ఇంటికెళదాం'' రోహిత్ అన్నాడు



ఆమె సూట్‌కేస్ అందుకుంటూ.

రమ్యని కారులో తమ యింటికి తీసుకెళ్ళారు రోహిత్ దంపతులు. ఇంట్లో కాసేపు కూర్చున్నాక రోహిత్ ఆఫీసుకు బయలుదేరాడు.

''నేను ఆఫీసుకు వెళ్ళొస్తానండి. మళ్ళీ సాయంత్రం వస్తాను. హేవ్ ఎ నైస్ టైమ్ విత్ యువర్ ఫ్రెండ్'' అని రమ్యతో చెప్పి వెళ్ళిపోయాడు.

''ఆ..ఇప్పుడు చెప్పు సంగతులు. ఎలా వుంది నీ కొత్తకాపురం? మీ ఆయన నిన్ను బాగా చూసుకొంటున్నట్లే ఉంది'' రమ్య అంది.

''అవును. ఆయనకు నేనంటే చాలా యిష్టం''

''ఎంతైనా కొత్తపెళ్ళాం కదా. ఆ ప్రేమ, యిష్టం కొద్దిరోజులుంటాయి''

''కొన్నిరోజులేం ఖర్మ. ఎన్నేళ్ళైనా అలాగే వుంటాయి. రమ్యా ఒక మనిషిని చదవడానికి పది రోజులు చాలు. ఆయనను రెండేళ్ళుగా చూస్తున్నాను కదా. ఆయన ప్రేమ మీద, అనురాగం మీద నాకు పూర్తిగా నమ్మకం ఉంది'' దృఢంగా అంది సింధు.

''నీకు ఆ నమ్మకం ఉంటే మంచిదే. నీకంటే అందమైన అమ్మాయి కనిపించి, కవ్విస్తే ఆ ప్రేమా, అనురాగం మాయమయిపోతాయేమోనని నా భయం. అసలే అందగాడు. ఆపై యువకుడు, ధనవంతుడు కూడాను. యు నో.. ఇంటి గ్రిటీ ఈజ్ లాక్ ఆఫ్ ఆపర్ట్యునిటీ''

''ఓకే.. నీవు నాకంటే అందగత్తెవే కదా. అదేదో నీవే ప్రయత్నించు. ఆయన ప్రేమలోని నిజాయితీ తెలిసిపోతుంది'' కోపంగా అంది సింధు.

''ఛ ఛ. నేను నీతో నాలుగు రోజులు సరదాగా గడపాలని వచ్చానే తప్ప నీ భర్తను నీనుంచి లాక్కోవడానికి కాదు'' అంది రమ్య.

''నువ్వు లాక్కొన్నా ఆయన నీమీద పడరు. వాదన అంటూ వచ్చింది కాబట్టి ఎవరో ఒకరు గెలవాలి. నా వాదన నిజమని ఒప్పుకో లేదా నీ వాదన నిజమని నిరూపించు''

''అలాగే. మీ ఆయునా చాలామంది లాంటి మగాడే అని నిరూపిస్తాను. అయితే దీనివల్ల మన స్నేహం చెడుతుందేమోనని నాకు భయంగా ఉంది'' అంది రమ్య.

''మన స్నేహమూ చెడదు. మా కాపురం కూడా చెడదు. చెప్పాగా నాకు ఆయనపై చాలా నమ్మకం అని'' అంది సింధు.

''సరే. ఇక ఆ పనిమీదే వుంటాను''

తర్వాత ఆ విషయం మరచిపోయి ఆనందంగా కబుర్లు చెప్పుకున్నారు స్నేహితురాళ్ళిద్దరూ. మధ్యాహ్నం కాసేపు నిద్రపోయి లేచారు.

''సింధూ. మీవారికి ఫోన్ చేసి నీవు సరుకుల కోసం బయటికి వెళ్తున్నానని, ఆరుగంటలకు యింటికి తిరిగి వస్తానని, ప్రయాణపు బడలిక వల్ల నేను యింట్లోనే వుంటానని చెప్పు. నువ్వు ఓ గంట సేపు బయట తిరిగిరా'' కాఫీ త్రాగుతూ అంది రమ్య.

''ఎందుకు?''

''మరి నేను గెలవాలంటే నా ప్లానులేవో నేను వెయ్యాలి కదా''

సింధు ముఖంలో అనుమానం కనిపించి ''నేను మీవారి పాతివ్రత్యానికి భంగం కలిగించే ప్లానులేవీ వెయ్యనులే. భయపడకు'' అంది రమ్య నవ్వుతూ.

''ఛ ఛ. అది కాదు. ఇవన్నీ ఆయనకు తెలిస్తే కోపం వస్తుందేమోనని నా భయం''

''ఆయనకు తెలిసే అవకాశమే లేదు. మనిద్దరం చెప్పకపోతే ఆయనకెలా తెలుస్తుంది'' సింధుకు ధైర్యం చెప్తూ అంది.

''సరే జాగ్రత్త. మరీ ఓవర్ యాక్షన్ చెయ్యకు'' అంటూ సింధు భర్తకు ఫోన్ చేయసాగింది.

సింధు బయటకు వెళ్ళాక రమ్య సింధు బీరువా తెరచి ఆమె చీర ఒకటి ఎన్నుకొని తను ధరించింది. అందంగా మేకప్ చేసుకొని, ఫ్రిజ్‌లోని పూలు తలనిండా ధరించి రోహిత్ కోసం ఎదురు చూడసాగింది.

రోహిత్ కారు పార్కు చేసి వస్తూంటే హాల్లో వెనక్కు తిరిగి అల్మైరా సర్దుతున్నట్లు నటించసాగింది. ఆమె ఊహ ప్రకారం రోహిత్ రమ్యను వెనుకనుంచి కౌగలించుకొంటాడు. ఆమె ముఖం చూడకుండా ఉండటానికే ప్రయత్నించి వీలైనంతసేపు తన కౌగిలిలో బంధిస్తాడు. ఆ తర్వాత రమ్య ముఖాన్ని చూసి ''అరె.. సింధు చీరలో ఉంటే తనే అనుకొన్నాను. తప్పయిపోయింది. ఏమనుకోకండి'' అని బ్రతిమలాడతాడు. సింధు యింట్లో లేదని తెలిసీ అలా ప్రవర్తించాడు కనుక సింధు ఓడిపోయినట్లు, తను గెలిచినట్లు అవుతుంది. ఆ ఉద్దేశ్యంతోనే అతనికి ముఖం కనిపించకుండా అటు తిరిగి నిలుచుంది. ఎత్తులో రమ్య, సింధు దాదాపు ఒకేలా వుంటారు.

రోహిత్ లోపలికి రాగానే సోఫాలో కూర్చుని షూస్ విప్పుతూ ''సింధు యింకా రాలేదా'' అని అడిగాడు.

''ఇంకా రాలేదు. ఈపాటికి వచ్చేస్తూ ఉంటుంది. '' అంది రమ్య.

'' మీరు రెడీగానే ఉన్నారు కదా. నేనూ రెడీ అయి వస్తాను. సింధు రాగానే బిర్లామందిరం వెళ్దాం'' అంటూ లోపలికి వెళ్ళిపోయాడు.

సింధు రాగానే ''ఏమైంది నీ ప్లాను?'' అని అడిగింది ఆత్రుతగా.

''ఫ్లాప్. అవునూ నా ప్లాను కూడా ఫోనులో చెప్పేశావా ఏమిటి?'' అనుమానంగా అడిగింది రమ్య.

''అసలు నీ ప్లానేంటో నాకు తెలిస్తే కదా ఆయనకు చెప్పడానికి. నీకు నామీద నమ్మకం లేకపోతే వదిలేద్దాం'' నిష్ఠూరంగా అంది సింధు.

''లేదులే. ఊరికే అడిగాను చనువుకొద్దీ''

మరుసటి రోజు సినిమాకు టికెట్లు తెమ్మంది సింధు భర్తతో. తీరా బయల్దేరేముందు తనకు కడుపునొప్పిగా ఉందని, వాళ్ళిద్దరినీ వెళ్ళి రమ్మని చెప్పింది సింధు.

''పోనీ టికెట్లు కాన్సిల్ చేద్దాం'' అన్నాడు రోహిత్.

''వద్దండీ. రమ్యకు సినిమా పిచ్చి ఎక్కువ. మీరిద్దరూ వెళ్ళిరండి'' అంది సింధు.

''సిల్లీగా మాట్లాడకు. నువ్వు యిక్కడ కడుపు నొప్పితో బాధపడుతూంటే అక్కడ నేను సినిమా ఎలా చూడగలననుకొన్నావ్'' చిరుకోపంతో అన్నాడు రోహిత్.

''నొప్పి ఎక్కువగా ఉంటే నేను మాత్రం మిమ్మల్ని పంపుతానా. ప్లీజ్. మీరు వెళ్ళి రండి. లేకుంటే అది డిసప్పాయింట్ అవుతుంది'' అభ్యర్థిస్తూ అంది సింధు.

ఇంటర్వెల్‌లో యిద్దరూ బయటకు వచ్చారు. రోహిత్ కూల్‌డ్రింక్స్ తెచ్చి ఆమెకొకటిచ్చి తనొకటి తీసుకున్నాడు.

''సింధు మిమ్మల్ని చేసుకున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. సింధు నిజంగా అదృష్టవంతురాలు. మీరు సింధు కంటే ముందు నాకు పరిచయమయివుంటే నేను మిమ్మల్ని సింధుకు వదిలేదాన్ని కాను'' కూల్‌డ్రింక్ తాగుతూ అంది రమ్య.

''మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్'' అన్నాడు రోహిత్ సింపుల్‌గా.

''అఫ్‌కోర్స్. కానీ మానవ ప్రయత్నం కూడా ఉండాలిగా. ఐ ఎన్వీ సింధు'' అతని కళ్ళలోకే చూస్తూ అంది.

''యూ నీడ్ నాట్ బీ అన్‌హాపీ. మీకోసం కూడా ఓ అందమైన యువకుడు, చదువుకొన్నవాడు, మంచి ఉద్యోగం ఉన్నవాడు, తన కోరికల్ని, ఆశల్ని మీకోసమే దాచుకొని తన జీవితంలో మీ రాక కోసం ఎక్కడో ఒకచోట ఎదురుచూస్తూ ఉండి ఉంటాడు''

## పూజా ఆనందం

**ఏవో రెండుమూడు సినిమాల్లో నటించాక ఛాన్స్‌లు లేక, ఏంచేయాలో తెలియక సతమతమవుతుంటారు సినీతారలు. రాకరాక ఓ సినిమా ఛాన్స్ రావడంతో పూజాబాత్రా కూడా ఆనందంతో ఉబ్బితబ్బిబవుతోంది. మష్‌రాక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ పతాకంపై తయారవుతున్న కొత్త చిత్రం 'తాజ్‌మహల్ ఏ ఎటర్నల్ లవ్‌స్టోరీ'. అక్బర్‌ఖాన్ స్క్రిప్ట్, దర్శకత్వాన్ని సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని మంచి రొమాంటిక్ టచ్‌తో రూపొందిస్తున్నారు. దక్షిణాఫ్రికాకి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు ఫాతిమామీర్ స్క్రిప్ట్ రచనలో సహాయం అందిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో కబీర్‌బేడి, మనీషాకొయిరాలా, అర్బాజ్‌ఖాన్, పూజాబాత్రా, అర్బాజ్‌అలీ, కింశర్మలు నటిస్తున్నారు.**



తొమ్మిది గంటలకు సినిమా పూర్తయింది. కారు ఇంటి దగ్గర ఆపగానే పనిమనిషి రోహిత్ దగ్గరకు వచ్చి ''అమ్మగారు పెద్దయ్యగారింటికి వెళ్ళారు. పది గంటలకు వచ్చేస్తానన్నారు. మిమ్మల్నిద్దరినీ భోం చేసేయమన్నారు'' అంటూ యింటి తాళం చెవి అతనికిచ్చింది.

''సింధుకు కడుపునొప్పి ఎలా వుంది?'' ఆదుర్దాగా అడిగాడు.

''తగ్గిపోయిందంట. నేను వెళ్ళొస్తాను'' అంటూ ఆమె వెళ్ళిపోయింది.

రోహిత్, రమ్య కబుర్లు చెప్పుకుంటూ భోం చేశారు. రోహిత్‌కు ఎదురుగా కూర్చుంది రమ్య. రోహిత్ వద్దంటున్నా వినకుండా అతనికి పెరుగు వెయ్యడానికి ముందుకు వంగింది రమ్య. రెండు చేతులూ తన పళ్ళేనికి అడ్డంగా పెట్టాడు రోహిత్. అతని చేతుల్ని తప్పించి వడ్డించడానికి మరింత ముందుకు వంగింది. ఆ కదలికకు ఆమె పైట క్రింద పడిపోయింది. ఒక చేతిలో పెరుగు గిన్నె ఉంది. మరో చేయి ఎంగిలి చేయి. ఏం చేయాలో తోచనట్లు నిలబడిపోయింది.

ఎదురుగా కనిపిస్తున్న దృశ్యం చూసి నిశ్చేష్టుడయ్యాడు రోహిత్. ఆమె ఉచ్ఛ్వాసనిశ్వాసలు స్పష్టంగా కనబడుతున్నాయి అతనికి. ముందుగా అతడే తేరుకుని

''ఆ పెరుగు గిన్నె క్రిందపెట్టండి'' అన్నాడు. వెంటనే గిన్నె క్రిందపెట్టి పైట నిండుగా కప్పుకుంది రమ్య.

రోహిత్ చేతులు కడుక్కుని తన బెడ్‌రూంలో కెళ్ళి మంచం మీద కూర్చుని కార్డ్‌లెస్ అందుకుని సింధుకు ఫోన్ చేశాడు. ''ఇదిగో నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను. ఇంకో అరగంటలో అక్కడుంటాను'' అంటూ ఫోన్ పెట్టేసింది సింధు.

''ఎవరికి ఫోన్?''

తలెత్తి చూశాడు రోహిత్. తలుపు దగ్గర రమ్య నిలబడి వుంది. నైటీ ధరించి ఉండడం వల్ల ఆమె అందాలు మరింత స్పష్టంగా కనిపించసాగాయి.

''సింధు. ఇప్పుడే బయలుదేరుతూందట''

అతని ఎదురుగా కూర్చుని తనలో తాను నవ్వుకోసాగింది.

''ఎందుకలా నవ్వుకుంటున్నారు''

''మిమ్మల్ని మీరు నగ్నంగా ఎప్పుడైనా చూసుకున్నారా?''

అదిరిపడ్డాడు ఆ ప్రశ్నకు. నవ్వుతూ అతని జవాబు కోసం ఎదురుచూస్తూంది రమ్య.

''చెప్పండి''

లేదన్నట్టు తలాడించాడు.

''నేను చూశాను''

సిగ్గు ముంచుకొచ్చిందతనికి.

''ఎప్పుడు? ఎక్కడ?'' ఎలాగో గొంతు పెగల్చుకుని అన్నాడు.

''ఇక్కడ'' అంటూ తన చేతిలోని ఫొటో అతనికి చూపించింది. లేచి ఆత్రంగా ఆమె వైపు వచ్చాడు. ఆమె లేచి మంచం చుట్టూ అతన్నుంచి తప్పించుకుని తిరుగుతూ అలాగే మంచంపై ఒరిగిపోయింది. బలవంతంగా ఆమె చేతిలోని ఫొటోను తీసుకుని చూశాక అతని మనసు శాంతించింది. అది అతనికి రెండేళ్ళ వయస్సున్నప్పుడు తీసిన ఫొటో.

ఇంతలో రమ్య చేతులు రెండూ తన చుట్టూ బిగుసుకుపోవడం గ్రహించి తనూ ఆమె చుట్టూ చేతులు వేసి గట్టిగా కౌగలించుకున్నాడు. ఆమె విడిపించుకోబోయింది. అతడు వదల్లేదు.

అయిదు నిముషాలు అలా అతని కౌగిలిలో ఉండిపోయింది. ఇంతలో కాలింగ్‌బెల్ మ్రోగడంతో రోహిత్ చటుక్కున లేచి ఆమె వైపు చూసి, తలుపు తీయడానికి వెళ్లాడు. రమ్య గబగబా ప్రక్కగదిలోకి వెళ్లింది.

పడుకోబోయే ముందు రమ్య గదికి వచ్చింది సింధు.

''ఏమైంది నీ ప్లాన్?''

''సూపర్‌హిట్'' గర్వంగా చెప్పింది రమ్య.

''నేను నమ్మను''

''నేను నిన్ను నమ్మాను'' అంది రమ్య.

''సారీ ఏం జరిగిందో చెప్పు'' ఆత్రుతగా అడిగింది సింధు.

జరిగింది చెప్పింది రమ్య. సింధు కళ్ళనిండా నీళ్ళు నిండాయి. స్నేహితురాలి ముందు ఓడిపోయినందుకు అవమానం, భర్త ప్రవర్తన గురించి బాధ, ఏడుపు ఆమెను చుట్టుముట్టాయి.

''సారీ సింధూ. అనవసరంగా మనం ప్రాబ్లమ్స్ కొని తెచ్చుకున్నాం. అయినా నేను రెచ్చగొట్టడం వల్లే మీ ఆయన అలా ప్రవర్తించారు. ఇందులో ఆయన తప్పేమీ లేదు''

రమ్య ఊరికెళ్లాక సాయంత్రం ఆఫీసునించి ఇంటికి రాగానే సింధు ప్రక్కనే చేరాడు రోహిత్.

''అబ్బ. ఎన్నాళ్లకి నాకాంతతో ఏకాంతం దొరికింది నాకు''

''ఏకాంతానికి ఏ కాంతైతే ఏం? భార్యే కావాలని లేదుగా''

''ఏకాంతైతే ఏం అనుకునే రకం కాను నేను. నాకాంతే నాకిష్టం'' ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకుంటూ అన్నాడు.

''ఎందుకండీ ఈ నటనలు? రమ్య నాకంతా చెప్పింది మీకు నేనంటే చాలా ఇష్టమనీ, మరే ఆడపిల్ల రెచ్చగొట్టినా లొంగరని దానితో గర్వంగా చెప్పాను. అది నా గర్వాన్ని అణచి, మీ మీద మనసు విరిగిపోయే నిజం చెప్పి వెళ్ళిపోయింది'' వెక్కివెక్కి ఏడవసాగింది సింధు.

''పిచ్చి సింధు. నీవు ఓడిపోలేదు గెలిచావు'' ఆమె భుజం మీద చేయి వేసి అనునయిస్తూ అన్నాడు.

'గెలిచానా ఎలా?''

''చెబుతాను. నీవు మా ఇద్దరికీ పదేపదే ఏకాంతం కల్పించడం చూసి నాకు అనుమానమొచ్చింది. చూచాయిగా విషయం ఊహించాను. రమ్య గెలవాలనే అలా ప్రవర్తించాను. ఎందుకో తెలుసా. నీవు గెలుస్తున్నకొద్దీ రమ్య తన ప్రయత్నాలు మరింత అధికం చేస్తుంది. అవి ఎక్కడికైనా దారితీయవచ్చు. అందుకే ఆమెను గెలిపించి మన కాపురాన్ని కాపాడాను.

నా ప్రేమలోని నిజాయితీని పరీక్షించడానికి మీరు ఎన్నుకున్న పద్ధతి మంచిదికాదు. నాలా ఆలోచించేవాడు కాకుండా మరెవ్వరైనా నా స్థానంలో ఉండి ఉంటే రమ్య జీవితం ఏమయ్యేది?

నా దృష్టిలో ప్రపంచంలోకెల్లా అందమైన ఆడదానివి నువ్వే. ఏ అమ్మాయి కనిపించినా ఈమె సింధు అంత అందగత్తె కాదు అనుకుంటాను. ఒకవేళ నిజంగా నీకంటే అందగత్తె కనిపించినా 'సింధుకున్న మంచితనం ఈ అమ్మాయికి ఎక్కడుంటుంది' అనుకుంటాను. అలా అనుకుంటాను కనుకే నీతో సంతోషంగా, తృప్తిగా ఉన్నాను. రెండు రోజులు ఉండిపోయే రమ్య కోసం జీవితాంతం నాకు తోడుగా ఉండే నిన్ను వదులుకోగలనా చెప్పు. నీవు రమ్యతో వాదనలోనే ఓడావు. జీవితంలో ఓడిపోలేదు. ఓడిపోవుకూడా. నా ప్రవర్తన వల్ల నీవు సిగ్గుపడే రోజు ఎన్నటికీ రానివ్వను. ప్రామిస్'' అన్నాడు.

''నన్ను క్షమించండి. మిమ్మల్ని పరీక్షించడం నా తప్పు. అదీ స్నేహితురాలి ద్వారా ఆ పనిచేయడం మరో తప్పు'' అతనికి చేరువవుతూ మనస్ఫూర్తిగా అంది సింధు.

★

